నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | KHAMMAM

కిడ్నాప్ అయిన కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మితో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పోకడ గూండాగిరి

కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును సమావేశానికి హాజరు కాకుండా అపహరించి తీసుకెళ్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ఇల్లెందు పట్టణంలో ఎమ్మెల్యే 'కోరం', ఆయన అనుచరుల అరాచకం
- మున్సిపల్ కార్యాలయం సాక్షిగా కౌన్సిలర్ అపహరణ
- కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఫైర్
- బీఆర్ఎస్ నాయకులు, అపహరణకు గురైన కౌన్సిలర్ భార్యతో కలిసి ప్రదర్శన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులపై కేసు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)/ ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో శిరీష ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో వద్ద హైడ్రామా జరిగింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సినీ ఫక్కీలో అవిశ్వాస తీర్మాన సమావేశానికి వస్తున్న కొక్కు నాగేశ్వరరావు అనే కౌన్సిలర్‌ను అపహరించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన మరో ఐదుగురు కౌన్సిలర్లను ప్రత్యేక క్యాంప్‌నకు తరలించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. అయినప్పటికీ ఎమ్మెల్యే కోరం కనకయ్య నోరు మెదపలేదని, చూస్తూ ఉండిపోయారని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల అద్దాలు పగులగొట్టి విధ్వంసానికి పాల్పడినా తమను దూషించినా పోలీసులు చూస్తూ ఉండిపోయినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దశలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పట్టణంలో ప్రదర్శనగా వెళ్లి కిడ్నాప్‌కు గురైన కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు భార్య వెంకటలక్ష్మితో కలిసి ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరుల ఆగడాలు, అరాచకాలపై ఫిర్యాదు చేశారు.

ఇల్లెందుకు చేరుకున్న కౌన్సిలర్ నాగేశ్వరరావు..

కిడ్నాప్‌కు గురైన కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును కొన్ని గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు తిరిగి ఇల్లెందు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట వదిలిపెట్టినట్లు సమాచారం. సదరు కౌన్సిలర్‌ను ప్రత్యేక వాహనంలో భద్రాచలం పట్టణానికి తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది. కౌన్సిలర్ భార్య వెంకటలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం అందుకుని కౌన్సిలర్‌ను విడిచిపెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కిడ్నాప్‌కు గురైన కౌన్సిలర్ కూడా తిరిగి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తున్నది.

ఎమ్మెల్యే కోరం కనకయ్య గూండాగిరి చేశారు

మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన అనుచరులు గూండాగిరి చేసి బీఆర్ఎస్‌కు అనుకూలమైన కౌన్సిలర్లను బెదిరించారు. గూండాగిరి చేసి ఒక కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేశారు. ఎమ్మెల్యే దురాగతాలపై తాము గతంలోనూ కోర్టులను ఆశ్రయించాం. కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం బాధాకరం. దీనిపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజు సమాచారం ఇచ్చాం. వారు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం.

ఇల్లెందు : మాట్లాడుతున్న ఆర్డీవో శిరీష

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

కోరం పూర్తికి 17 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా.. 15 మంది మాత్రమే హాజరు

తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించిన ప్రిసైడింగ్ ఆఫీసర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)/ ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం హైడ్రామా, ఉద్రిక్తత నడుమ వీగిపోయింది. తెలిసిన వివరాల ప్రకారం.. మున్సిపల్ చైర్మన్‌పై 19 మంది కౌన్సిలర్లు అసమ్మతి ప్రకటించారు. ఈ మేరకు గత నెల 19న జిల్లాకేంద్రంలో కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్, కొత్తగూడెం ఆర్డీవో శిరీష ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కోరం లేక వీగిపోయింది. కోరం పూర్తి కావాలంటే సమావేశానికి స్థానిక మొత్తం సభ్యులు 24 మంది, ఎక్స్‌అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యేతో కలిపి తక్కువలో తక్కువ 17 మంది హాజరు కావాల్సి ఉండగా, కేవలం 15 మంది హాజరయ్యారు. కోరం లేదని నిర్ధారించిన ప్రిసైడింగ్ అధికారి అవిశ్వాస తీర్మానం వీగినట్లు ప్రకటించారు. ఆమె అవిశ్వాసాన్ని 12 గంటలకు వాయిదా వేశారు. అయినప్పటికీ 12 గంటలకు 15 మంది సభ్యులే హాజరయ్యారు. దీంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించారు.

ఎమ్మెల్యే కోరంపై కిడ్నాప్ కేసు

ఇల్లెందు, ఫిబ్రవరి 5: ఇల్లెందు పట్టణ కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు అపహరణపై ఆయన భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్యపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారని, ఆ సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతున్న కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును అపహరించారని తమకు ఫిర్యాదు అందిందని సీఐ వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

స్థల సర్దుబాటుపై దృష్టి పెట్టండి

వైద్య కళాశాలను సందర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మెడికల్ కళాశాలలో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి రూ.108 కోట్ల వ్యయంతో కొత్త భవనాలు వస్తాయని, వాటన్నింటికీ అవసరమైన స్థల సర్దుబాటుపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని సోమవారం సందర్శించిన మంత్రి తుమ్మల ప్రాంగణం మొత్తాన్ని స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ వీపీ గౌతమ్, వైద్యాధికారులతో కలిసి కాలేజీ భవనంలో సమీక్ష చేశారు. ప్రస్తుతమున్న వసతులు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లా ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ నిర్మించినందున పాత కలెక్టరేట్ భవనాలను మెడికల్ కాలేజీకి అప్పగించారన్నారు. దాదాపు రూ.10 కోట్లతో రెన్నోవేషన్ పనులు చేపట్టారన్నారు. రెండో సంవత్సరం నుంచి మరో వంద మంది విద్యార్థులు వస్తారని, భవిష్యత్ అవసరాలకు ఈ భవనం సరిపోతుందో.. లేదో.. పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాబోయే విద్యార్థులకు మంచి వైద్య కళాశాలను అందించడమే తమ లక్ష్యమని, ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించాలన్నారు.

కార్యక్రమంలో ఇంచార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాములునాయక్, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీ సరిత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ బీ బాబూరత్నాకర్, డాక్టర్ రాథోడ్ వినాయక్, డాక్టర్ ఎం.రాధిక, డాక్టర్ బీ దివ్యదర్శిని, డాక్టర్ డీ చండీప్రియ, డాక్టర్ జీ కరిష్మ, ఆర్ఎంవోలు డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం చేస్తున్నాం : ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 5 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీలు(ఫస్ట్ లెవల్ చెకింగ్) ఈసీఐఎల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో చేపట్టినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ వద్ద చేపట్టిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవీఎంలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు వచ్చిన 3,794 బ్యాలెట్ యూనిట్లు, 1,920 కంట్రోల్ యూనిట్లు, 2,263 వీవీ ప్యాట్ యంత్రాల పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు జి.గణేశ్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు పి.శ్రీనివాస్, జీఎస్ఆర్ఏ.విద్యాసాగర్, పున్నయ్య, ఆర్.ప్రకాశ్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఫ్రాన్సిస్, వాసిరెడ్డి రామనాథం, కె.కరుణాకర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

ఈవీఎం గోదాంను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం, లక్ష్మీదేవిపల్లి మండలం రామచంద్ర కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి 15వ తేదీ వరకు వివిధ పార్టీల ప్రతినిధులు సమక్షంలో వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల మధ్య ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను ఇంజినీర్ల పర్యవేక్షణలో అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం జిల్లాకు 1,588 బ్యాలెట్ యూనిట్లు 1,424 కంట్రోల్ యూనిట్లు, 1,633 వీవీ ప్యాట్ యంత్రాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఈవీఎంల పనితీరును పరిశీలించడానికి మొదటి దశ పరిశీలన అత్యంత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్, ఈసీఐఎల్ ఇంజినీర్లు, వివిధ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్.. భాష మార్చుకోవాలి

స్థాయిని మరిచి అసభ్యంగా మాట్లాడడం సంస్కార హీనం

60 రోజులైనా ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు

మేయర్ లేకుండానే మంత్రి తుమ్మల సమీక్షించడం సరికాదు

లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ కనుమరుగు ఖాయం

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి: బీఆర్ఎస్ నేత రాకేశ్

ఖమ్మం, ఫిబ్రవరి 5 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకోవాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు సూచించారు. సీఎం పదవిలో ఉండి కూడా ఆయన తన స్థాయిని మరిచి సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణను తెచ్చిన ఉద్యమ నేత కేసీఆర్ పట్ల రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న అసభ్య పదజాలాన్ని విని రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకోవాలని హితవుచెప్పారు. అసలు కేసీఆరే లేకపోతే రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు అయ్యేవారా? ముఖ్యమంత్రి అయ్యేవారా? అని ప్రశ్నించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రేవంత్ గురువు చంద్రబాబు వంటి వారు కూడా ఏనాడూ ఇలాంటి బూతులు మాట్లాడలేదని గుర్తుచేశారు. పాలన మొదలుపెట్టి 60 రోజులైనా హామీలను ఎందుకు అమలు చేయలేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలనూ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు సాయం ఇంకా ఇవ్వలేదని, వ్యవసాయ విద్యుత్‌ను 6 గంటలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని, దీంతో కూసుమంచి రైతులు ఆదివారం ధర్నా కూడా చేసి నిరసన తెలిపారని గుర్తుచేశారు. ఆసరా పింఛన్ల అడ్రస్ లేదని, గ్యాస్ సిలిండర్ల ఊసే లేదని విమర్శించారు. హామీల అమలులో నిర్లక్ష్యంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నాయకులను ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు నిలదీస్తారని అన్నారు. తెలంగాణ గురించి గతంలో ఏ రోజూ మాట్లాడని రేవంత్.. గతంలో 'జై తెలంగాణ' అంటూ నినదించిన వారిని తుపాకులతో బెదిరించిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. దేశంలో కర్ణాటక, తెలంగాణ మినహా ఏ రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికారంలో లేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పటికే చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మంత్రులు కూడా తమ స్థాయిని మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉమ్మడి నల్గొండలో ఒక మంత్రి.. అక్కడి జడ్పీ చైర్మన్‌ను మెడ పట్టుకొని నెట్టారని అన్నారు. ఖమ్మంలో మేయర్ లేకుండానే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేఎంసీ అధికారులతో సమీక్షించడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు జీవన్, డోకుపర్తి సుబ్బారావు, కొల్లు పద్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన ఎండుమిర్చి

- ఖమ్మం ఏఎంసీకి రికార్డు స్థాయిలో 50 వేల బస్తాలు
- ఎర్ర బంగారంతో కిక్కిరిసిపోయిన మిర్చియార్డు
- జెండాపాటలో క్వింటాకు రూ.21,600 ధర

మిర్చియార్డుకు పోటెత్తిన బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 5: రెండు రోజుల సెలవుల అనంతరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎండుమిర్చి భారీగా వచ్చింది. దీంతో యార్డంతా మిర్చి బస్తాలతో పోటెత్తింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే వివిధ జిల్లాల నుంచి రైతులు తమ పంటను భారీ మొత్తంలో తేవడం ప్రారంభించారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడం, మార్కెట్లో పంటకు ధర నిలకడగా ఉండడం వంటి కారణాలతో ఇదే అదునుగా భావించిన రైతులు.. పంటను మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఒకరోజు ముందుగానే పంట రావడంతో మార్కెట్ కమిటీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం జెండాపాట సమయానికి రికార్డు స్థాయిలో 50 వేల బస్తాలు వచ్చాయి. దీంతో మిర్చియార్డంతా ఎర్ర బంగారం బస్తాలతో కిక్కిరిసింది. ఈ సంవత్సరంలో అత్యధిక పంట రావడం ఇదే తొలిసారి. అనంతరం జరిగిన జెండాపాటలో క్వింటాకు రూ.21,600 చొప్పున గరిష్ఠ ధర పలికింది. మధ్య ధర రూ.19,500, కనిష్ఠ ధర రూ.14 వేలుగా నిర్ణయించి ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. అదేవిధంగా తాలురకం పంటకు గరిష్ఠ ధర క్వింటాకు రూ.12 వేలు పలికింది. మార్కెట్‌కు వచ్చిన పంట అత్యధికంగా నాణ్యమైనది కావడంతో ఖరీదుదారులు పంటను కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం దాకా ఖరీదులు కొనసాగాయి. భారీగా యార్డుకు పంట రావడంతో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్.. గ్రేడ్ టూ అధికారి బజార్‌తో కలిసి యార్డులో క్రయవిక్రయాలను పరిశీలించారు. కాంటలు, తోలకాలు సకాలంలో జరిగేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రానికి తోలకాల ప్రక్రియ ముగిసింది. దీంతో రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ.. పంట తాకిడి పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మార్కెట్ కమిటీ పూర్తి సిబ్బందిని, అధికారులను మిర్చి యార్డులో విధుల్లో ఉంచామని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- **ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ (స్టూడెంట్ అఫైర్స్) డాక్టర్ సత్యనారాయణ**

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్ఏ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, రాష్ట్రస్థాయి, జాతీయ పోటీల్లోనూ రాణించాలని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ (స్టూడెంట్ అఫైర్స్) డాక్టర్ జెల్లా సత్యనారాయణ పిలుపునిచ్చారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో యూనివర్సిటీ పరిధిలోని నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమిస్తున్నాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడలతో మస్తిష్కాలు వికసించి మేధోవికాసానికి దోహదం చేస్తాయన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, అదిలాబాద్ ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుకుంటే విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా ఛేదించవచ్చన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యకు భారతదేశ వ్యాప్తంగా డిమాండ్ ఉన్నదన్నారు. తమ కళాశాల పరిధిలో పండించిన ప్రతి పంటకు, ప్రతి మొక్కకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశీలకుడు జె.సురేష్, కళాశాల ప్రొఫెసర్లు, పీడీలు, ఓఐఎస్వోలు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభం

సోమవారం మొదలైన క్రీడలు ఈనెల 8 వరకు కొనసాగుతాయని కళాశాల యాజమాన్యం తెలిపింది. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 వ్యవసాయ కళాశాలలకు చెందిన 425 మంది విద్యార్థులు అశ్వారావుపేటకు విచ్చేశారు. వీరంతా అథ్లెటిక్స్, ఖో ఖో, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్ తదితర పోటీల్లో పాల్గొంటారు.